కప్పం కట్టాల్సిందే...

- ప్రభుత్వ స్థలాలపై ప్రైవేటు పెత్తనం
- సొంత స్థలాల మాదిరి దర్జాగా అద్దెల వసూళ్లు
- తోపుడు బండ్ల వ్యాపారులపై దౌర్జన్యం చేస్తున్న కేటుగాళ్లు
- పట్టించుకోని నగర పాలక సంస్థ అధికారులు

అవకాశం దొరకాలే గాని...గాలిని కూడా అమ్మేసి డబ్బు చేసుకునే మనుషులున్న లోకం ఇది. నగరంలో రహదారిని కూడా తమ సొంత స్థలాలుగా చెప్పుకుంటూ అక్కడ తోపుడు బండ్లపై పండ్లు అమ్ముకునే నిరుపేదల వద్ద దౌర్జన్యంగా అద్దెలు వసూలు చేస్తున్న ఘరానా దొంగలు ఉన్నారిక్కడ. నగరంలోని సీకే రెడ్డి రోడ్డులో ఈ దోపిడీ జరుగుతోంది. అయినా అధికారులు తెలిసీ తెలియనట్టు చోద్యం చూస్తున్నారు.

మధురానగర్(విజయవాడసెంట్రల్): కేదారేశ్వరపేట నుంచి రామలింగేశ్వర పేట వరకు సీకే రెడ్డి రోడ్డులో వ్యాపారం చేసుకోవాలంటే కప్పం కట్టాల్సిందే. విశాలంగా ఉండే సీకే రెడ్డి రోడ్డులో మార్జిన్‌లు విశాలంగా ఉన్నాయి. ఇక్కడకు అత్యంత సమీపంలో పండ్ల మార్కెట్, రైతు బజారు ఉంది. ఇక్కడ వ్యాపారాలు రాత్రీ, పగలు కూడా జోరుగా సాగుతుంటాయి. దీన్ని అవకాశంగా చేసుకుని కొంతమంది వ్యాపారస్తులు స్వంత స్థలం మాదిరిగా అద్దెలకు ఇస్తున్నారు. ఇక్కడ రాత్రిపూట ఒక బండి పెట్టుకోవాలంటే రూ.30 నుంచి 50 వరకు వసూలు చేస్తున్నారు. వ్యాపారాలు చేసుకునే వారి వద్ద నుంచి రోజుకు రూ.500 వసూలు చేస్తున్నారు. ఇక్కడ రాకపోకలకు సైతం ఇబ్బందులు కలిగేలా వ్యాపారాలు సాగిస్తున్నారు. పాత సిమెంట్ ఫ్యాక్టరీ వంతెన వద్ద కనీసం సిటీ బస్సు మలుపు తిరిగేందుకు సైతం ఇబ్బంది పడే విధంగా రోడ్డు వరకు ఆక్రమించి మరీ వ్యాపారాలు సాగిస్తున్నారు.


సీకే రెడ్డి రోడ్డులో వ్యాపారాలు నిర్వహిస్తున్న పండ్ల విక్రయదారులు

కొంతమంది వ్యాపారులు పందిళ్లు సైతం ఏర్పాటు చేశారు. ఈ విషయమై స్థానిక కార్పొరేటర్ సైతం పలుమార్లు కౌన్సిల్‌లో చర్చించటంతో పాటు అధికారుల దృష్టికి తీసుకువెళ్లారు. అధికారులు తూతూమంత్రంగా వ్యాపారులు ఏర్పాటు చేసిన పందిళ్లను తొలగించి వెళ్లిపోయారు. నిత్యం రద్దీగా ఉండే ఇక్కడ రోడ్డు పక్కన వ్యాపారుల నుంచి రోజువారీ లెక్కన అద్దె వసూలు చేస్తున్నారు. వ్యాపారాన్ని బట్టి రోజుకు, రాత్రికి ఇంత అని వసూలు చేస్తూ అందినకాడికి దండుకుంటున్నారు. అద్దె ఇవ్వని పక్షంలో దుకాణాలు ఖాళీ చేయిస్తున్నారు. అద్దె ఇవ్వలేదంటూ దాడికి పాల్పడటంతో ఇప్పటికే పలువురు పోలీసులను ఆశ్రయించారు. ఇక్కడ వినాయకుడు, అమ్మవారి విగ్రహాలు విక్రయాల సమయంలో సైతం వ్యాపారుల నుంచి లక్షలాది రూపాయలు వసూలు చేశారని ఆరోపణలు వినిపిస్తున్నాయి. అధికారులు స్పందించి ఇక్కడ చిరు వ్యాపారులకు అండగా నిలవటంతో పాటు ప్రభుత్వ స్థలాల నుంచి అద్దెలు వసూలు చేస్తున్న వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

అద్దెకు ఇస్తున్నట్లు నా దృష్టికి వచ్చింది.



ఇక్కడ స్థలాలను అద్దెకు ఇస్తున్నట్లు నా దృష్టికి వచ్చింది. ఇక్కడ వ్యాపారాలు చేసుకోవటానికి నేను వ్యతిరేకం కాదు. కానీ స్వంత స్థలాల మాదిరిగా కొందరు అద్దెలకు ఇచ్చుకోవటాన్ని వ్యతిరేకిస్తున్నాను. ఇప్పటికే ఈ విషయాన్ని అధికారులు, స్థానిక ఎమ్మెల్యే బొండా ఉమా మహేశ్వరరావుతో పాటు కౌన్సిల్ దృష్టికి తీసుకువెళ్లాను.

–చన్నగిరి రామ్మోహనరావు, కార్పొరేటర్

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

మధురానగర్(విజయవాడసెంట్రల్): విద్యుత్ వైర్ల మరమ్మతుల దృష్ట్యా మాచవరం సబ్ స్టేషన్, 11కేవీ దాసాంజనేయ ఫీడర్ పరిధిలో శనివారం ఉదయం 8 గంటల నుంచి 10.30 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ఏపీసీపీడీసీఎల్ కార్యనిర్వాహక ఇంజినీరు పి.రవీంద్ర బాబు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. మాచవరం బీఆర్టీఎస్ రోడ్డు, కేన్సర్ హాస్పిటల్ ఏరియా, ఏలూరు రోడ్డు, నార్ల వారి వీధి, కుటుంబరావు వీధి, బుల్లెమ్మ వీధి, కాటూరి వారి వీధి, దానయ్య వీధి, పోతినేని వారి వీధి, అక్కుల తాతయ్య వీధి, దుగ్గిరాల బలరామకృష్ణయ్య వీధి, మాచవరం రైవస్ కాలువ కట్ట ఏరియా, పడవలరేవు బీఆర్టీఎస్ రోడ్డు నుంచి మాచవరం దాసాంజనేయ స్వామి గుడి మధ్య ఉన్న ఏలూరు రోడ్డు వైపు ఏరియాలలో విద్యుత్ సరఫరా నిలిచిపోతుందన్నారు. వినియోగదారులు తమ సిబ్బందికి సహకరించాల్సిందిగా ఆయన కోరారు.

అనువాదంతో ఉపాధి అవకాశాలు

మధురానగర్(విజయవాడసెంట్రల్): అనువాదం ద్వారా విద్యార్థులకు సాహిత్యం, మీడియా, పర్యాటకం వంటి అనేక రంగాలలో ఉపాధి అవకాశాలు లభిస్తున్నాయని ఎస్ఆర్ఆర్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.భాగ్యలక్ష్మి అన్నారు. స్థానిక మాచవరం ఎస్ఆర్ఆర్ అండ్ సీవీఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో శుక్రవారం అనువాదం సర్టిఫికెట్ కోర్సు ముగింపు కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విద్యార్థుల అవసరాలు, ఉపాధి అవకాశాలను బట్టి కోర్సులను నిర్వహిస్తున్నామని తెలిపారు. మారుతున్న కాలానుగుణంగా విద్యార్థులు నైపుణ్యాలు పెంపొందించుకోవాలని సూచించారు. అనంతరం కోర్సు పూర్తిచేసిన విద్యార్థులకు సర్టిఫికెట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో తెలుగు శాఖ విభాగాధిపతి ఎస్.అనిత మార్గరెట్, అధ్యాపకులు ఎస్.శ్రీకాంత్, కేవీ శాంతకుమారి తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

క్రీడల్లో నైపుణ్యాలు పెంపొందించుకోవాలి



మధురానగర్(విజయవాడసెంట్రల్): విద్యార్థులు విద్యకే పరిమితం కాకుండా క్రీడల్లో నైపుణ్యాలు పెంపొందించుకోవాలని ఎస్ఆర్ఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.భాగ్యలక్ష్మి సూచించారు. స్థానిక మాచవరం ఎస్ఆర్ఆర్ అండ్ సీవీఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో శుక్రవారం కృష్ణా యూనివర్సిటీ అంతర్ కళాశాలల వాలీబాల్ టోర్నమెంట్‌లో తృతీయ స్థానం సాధించిన క్రీడాకారుల అభినందన కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఇదే స్ఫూర్తితో మరిన్ని పతకాలు సాధించాలని సూచించారు. కార్యక్రమంలో కళాశాల వ్యాయామ విద్య విభాగాధిపతి డాక్టర్ డి.యుగంధర్, వైస్ ప్రిన్సిపాల్ పి.శైలజ, డాక్టర్ డీఎస్‌వీఎస్ బాల సుబ్రహ్మణ్యం, డాక్టర్ కొల్లేటి రమేష్, ఫిజికల్ డైరెక్టర్ డి.నవీన్‌కుమార్ విద్యార్థులను అభినందించారు.

శాస్త్రీయ సంగీత వైభవాన్ని చాటిన కచేరీ



విజయవాడ కల్చరల్: గాయక సార్వభౌమ పారుపల్లి రామకృష్ణయ్య 141 వ జయంతి సందర్భంగా గాయక సార్వభౌమ సంగీత పరిషత్, స్వరఝరి ఆధ్వర్యంలో దుర్గాపురంలోని శివరామకృష్ణ క్షేత్రంలో సంగీత విద్వాంసురాలు కమల దీప్తి నిర్వహించిన శాస్త్రీయ సంగీత కచేరీ సంగీత వైభవాన్ని చాటింది. పచ్చమిరియం భైరవి రాగంతో ప్రారంభించి ముత్తుస్వామి దీక్షితార్ కీర్తన హేరంబాయ నమస్తే, శ్యామశాస్త్రి కీర్తన నన్నుబ్రోవు లలిత, త్యాగరాజ స్వామి కీర్తన చలమేలరా, మనములేడ, ముత్తయ్య భాగవతార్ కీర్తన వంచతోను కీర్తనలను మధురంగా ఆలపించారు. వయోలిన్‌పై బీవీ దుర్గాభవాని, మృదంగంపై సద్గురు చరణ్, ఘటంపై హరిబాబు సహకరించారు. శనివారం నాటి కార్యక్రమంలో చెన్నైకి చెందిన సాతూరు కృష్ణ రామరత్నం కచేరీ ఉంటుందని స్వరఝరి కార్యదర్శి మోదుమూడి సుధాకర్ తెలిపారు. కార్యక్రమంలో అన్నవరపు రామస్వామి, అంజనా సుధాకర్ పాల్గొన్నారు.

జనవరి 3నుంచి నగరంలో ట్రేడ్ ఎక్స్‌పో -2025



గాంధీనగర్(విజయవాడసెంట్రల్): విజయవాడ నగరంలో వచ్చే జనవరిలో స్మైలీ అసోసియేట్స్ ఆధ్వర్యంలో ట్రేడ్ ఎక్స్ పో నిర్వహిస్తున్నట్లు స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ చైర్మన్ కె.పట్టాభి తెలిపారు. జనవరి 3,4,5 తేదీలలో నగరంలోని వెన్యూ కన్వెన్షన్‌లో ఈ ఎక్స్‌పో జరుగుతుందన్నారు. శుక్రవారం విజయవాడ చాంబర్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీ కార్యాలయంలో ఎక్స్‌పో–2025 బ్రోచర్‌ను ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ట్రేడ్ ఎక్స్‌పోలో హాస్పిటాలిటీకి రంగానికి చెందిన స్టాల్స్ ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. ఈ అవకాశాన్ని ఆ రంగంలోని వ్యాపారులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.ఆర్యవైశ్య కార్పొరేషన్ చైర్మన్ డూండీ రాకేష్, బిల్డింగ్ వర్కర్స్ అదర్ కన్‌స్ట్రక్షన్ వర్కర్స్ అడ్వైజరీ కమిటీ చైర్మన్ గొట్టుముక్కల రఘురామరాజు, చాంబర్ ఆఫ్ కామర్స్ చైర్మన్ గద్దం రవి కుమార్, ప్రసాద్ పాల్గొన్నారు.

యూజీడీ, రోడ్డు నిర్మాణ పనులకు శంకుస్థాపన

అజిత్‌సింగ్‌నగర్(విజయవాడసెంట్రల్): స్థానిక 60వ డివిజన్ వాంబే కాలనీలో రూ.50 లక్షల వ్యయంతో నిర్మిస్తున్న అండర్ గ్రౌండ్ డ్రైనేజీ లైన్, ఏ, బీ బ్లాక్ కనెక్టింగ్ రోడ్ల నిర్మాణ పనులకు శుక్రవారం శంకుస్థాపనలు జరిగాయి. ప్రభుత్వ విప్, సెంట్రల్ ఎమ్మెల్యే బొండా ఉమామహేశ్వరరావు, స్థానిక కార్పొరేటర్ కంచి దుర్గ పాల్గొని కొబ్బరికాయలు కొట్టి శంకుస్థాపన పనులు ప్రారంభించారు. బుగతా శ్రీరాములు, కంచి ధనశేఖర్, కె.రామరాజు తదితరులు పాల్గొన్నారు.

16 నుంచి శివకామేశ్వరి పీఠంలో ధనుర్మాసోత్సవాలు

మధురానగర్(విజయవాడసెంట్రల్): అయోధ్యనగర్ శ్రీదత్తసాయి శివకామేశ్వరి పీఠంలో శ్రీ ధర్మపరిషత్ మహాసంస్థానమ్ ఆధ్వర్యాన ఈనెల 16 నుంచి వచ్చేనెల 13 వరకు ధనుర్మాసోత్సవాలు నిర్వహించనున్నట్లు పీఠం వ్యవస్థాపకుడు అవ్వా హేమ సుందర వరప్రసాద్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. 16వ తేదీ తెల్లవారుజామున 4 గంటలకు సుప్రభాత సేవతో ధనుర్మాసోత్సవాలు ప్రారంభమవుతాయన్నారు. ప్రతి రోజు తెల్లవారుజామున నగర సంకీర్తనతో పాటు శ్రీ కృష్ణా గోదా అష్టోత్తర శత నామార్చన, తిరుప్పావై సేవ, పాశుర విన్నపం జరుగుతాయన్నారు. జనవరి13న శ్రీ గోదా సహిత రంగనాథ స్వామివార్ల కల్యాణం జరుగుతుందని తెలిపారు. భక్తులు ధనుర్మాసోత్సవాలలో పాల్గొని స్వామి కృపకు పాత్రులు కావాలని కోరారు.

అంబేడ్కర్ ఆశయ సాధనకు పాటుపడతాం

మాజీ ఎమ్మెల్యే మల్లాది

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఆశయాల సాధన కోసం పాటుపడతామని మాజీ ఎమ్మెల్యే మల్లాది విష్ణు అన్నారు. శుక్రవారం డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ వర్ధంతిని పురస్కరించుకుని స్మృతివనంలోని సామాజిక న్యాయ మహాశిల్పం వద్ద ఘన నివాళులర్పించారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే మల్లాది విష్ణు మాట్లాడుతూ గత ఐదేళ్లలో అంబేడ్కర్ ఆశయాలకు అనుగుణంగా వైఎస్సార్‌సీపీ పాలన సాగించిందన్నారు. నగర మేయర్ రాయన భాగ్యలక్ష్మి, డెప్యూటీ మేయర్ అవుతు శ్రీ శైలజ, విద్యార్థి విభాగం వర్కింగ్ ప్రెసిడెంట్ ఎ.రవిచంద్ర, దొడ్డా అంజిరెడ్డి, కార్పొరేటర్ ఎండీ ఇర్ఫాన్, వేదాంతం చైతన్య, గుండె సుందర్‌పాల్ పాల్గొన్నారు.


సామాజిక న్యాయ మహా శిల్పం వద్ద అంబేడ్కర్‌కు నివాళులర్పిస్తున్న మల్లాది విష్ణు, పార్టీ నేతలు

గొప్ప మానవతావాది అంబేడ్కర్

మధురానగర్(విజయవాడసెంట్రల్): భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గొప్ప మానవతావాది అని, ఆయన చూపిన మార్గంలో నేటి యువత పయనించాలని వాకర్స్ డిస్ట్రిక్ట్ గవర్నర్ డాక్టర్ చిన్నం రామకృష్ణ సూచించారు. స్థానిక బావాజీపేటలో శుక్రవారం డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ వర్ధంతి పురస్కరించుకుని డెప్యూటీ గవర్నర్ డాక్టర్ బ్రహ్మదేశం వసంత కుమార్‌తో కలిసి అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో వాకర్స్ రీజినల్ కార్యదర్శి కొండాయగుంట రాము, బండారు వెంకటేశ్వర రావు, కోరంగి నాగ మల్లీశ్వరి, షఫీ, హేమంత్ రావు, పోతుల విల్సన్‌రాజు పాల్గొన్నారు.


బావాజీపేటలో అంబేడ్కర్‌కు నివాళులర్పిస్తున్న వాకర్స్ డిస్ట్రిక్ట్ గవర్నర్ డాక్టర్ చిన్నం రామకృష్ణ

బసవతారకనగర్‌లో...

శాంతినగర్, బసవతారకనగర్‌లోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహాలకు కార్పొరేటర్ చన్నగిరి రామ్మోహన్‌రావు పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన చేసిన సేవలను గుర్తు చేసుకున్నారు. కార్యక్రమంలో నాయకులు ఎలుగు వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు


బసవతారకనగర్‌లో అంబేడ్కర్ విగ్రహానికి పూల మాల వేస్తున్న కార్పొరేటర్ చన్నగిరి రామ్మోహన్

లబ్బీపేట(విజయవాడతూర్పు): సమాజంలో అసమానతలు రూపుమాపి, ప్రజలంతా కలసిమెలసి జీవించాలనే డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఆశయాల సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని 24వ డివిజన్ కార్పొరేటర్ కుక్కల అనిత అన్నారు. డాక్టర్ అంబేడ్కర్ వర్ధంతి సందర్భంగా గిరిపురంలో ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.


గిరిపురం అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న కార్పొరేటర్ కుక్కల అనిత

బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో...

విజయవాడస్పోర్ట్స్: భారత జాతికి డాక్టర్ బి.ఆర్. అంబేడ్కర్ చేసిన సేవలు చిరస్మరణీయమని బెజవాడ బార్ అసోసియేషన్(బీబీఏ) అధ్యక్ష, కార్యదర్శులు కొత్త చంద్రమౌళి, అరిగల శివరామప్రసాద్(రాజా) అన్నారు. అంబేడ్కర్ వర్ధంతి కార్యక్రమాన్ని బీబీఏ హాల్‌లో శుక్రవారం నిర్వహించారు. న్యాయవాదులు అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో బీబీఏ సభ్యులు చెరుకూరి శ్రీపతిరావు, వి.గురునాథం, వి.కోటయ్య, పి.శ్రీనివాసరావు పాల్గొన్నారు.


అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న బీబీఏ న్యాయవాదులు

అంబేడ్కర్‌కు నివాళి

మధురానగర్(విజయవాడసెంట్రల్): అంబేడ్కర్ కాలనీలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహానికి మాజీ కార్పొరేటర్ పిన్నంరాజు త్రిమూర్తిరాజు శుక్రవారం పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో దేవరపు మాల్యాద్రి, పడమటి రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

అంబేడ్కర్ జీవితం స్ఫూర్తిదాయకం

వైఎస్సార్‌సీపీ సెంట్రల్ నియోజకవర్గ సమన్వయకర్త మల్లాది విష్ణు

అజిత్‌సింగ్‌నగర్(విజయవాడసెంట్రల్): మహోన్నతమైన రాజ్యాంగాన్ని రచించి, దేశ ప్రజలకు దిశ, దశ నిర్దేశించిన బాబా సాహెబ్ అంబేడ్కర్ చిరస్మరణీయుడని వైఎస్సార్ సీపీ సెంట్రల్ నియోజకవర్గ సమన్వయకర్త, మాజీ ఎమ్మెల్యే మల్లాది విష్ణు అన్నారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ వర్ధంతి కార్యక్రమం సింగ్‌నగర్ ఆంధ్ర ప్రభ కాలనీలోని జనహిత సదనంలో శుక్రవారం జరిగింది. డెప్యూటీ మేయర్ అవుతు శ్రీశైలజారెడ్డితో కలిసి అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా విష్ణు మాట్లాడుతూ అంబేడ్కర్ ఆలోచనలకు ఆచరణ రూపం ఇస్తూ.. గత ప్రభుత్వంలో వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి పాలన సాగించారన్నారు.


ఆంధ్రప్రభ కాలనీలో అంబేడ్కర్ చిత్రపటం వద్ద నివాళులు అర్పిస్తున్న మల్లాది విష్ణు, అవుతు శ్రీశైలజ

కూటమి ప్రభుత్వం వచ్చాక దళితులపై దమనకాండ విపరీతంగా పెరిగిపోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. కక్ష సాధింపులతో ముందుకు వెళుతూ దళిత ప్రజాప్రతినిధులు, అధికారులను సైతం వేధిస్తున్నారని మండిపడ్డారు. కూటమి ప్రభుత్వం అనుసరిస్తున్న రాజ్యాంగ వ్యతిరేక విధానాలపై అంబేడ్కర్ స్ఫూర్తితో ప్రజలందరితో కలిసికట్టుగా పోరాటం చేస్తామన్నారు. వైఎస్సార్ సీపీ నాయకులు అవుతు శ్రీనివాసరెడ్డి, అలంపూర్ విజయ్, అక్బర్, తోపుల వరలక్ష్మి, పేరం త్రివేణి రెడ్డి, మేడేపల్లి ఝాన్సీ, యక్కల మారుతి, వెంకటేశ్వరమ్మ తదితరులు పాల్గొన్నారు.

అమెరికన్ హాస్పిటల్ వద్ద...

సింగ్‌నగర్ అమెరికన్ హాస్పిటల్ సమీపంలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహం వద్ద అంబేడ్కర్ వర్ధంతి జరిగింది. మద్దాల చక్రవర్తి ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ సెంట్రల్ నియోజకవర్గ సమన్వయకర్త, మాజీ ఎమ్మెల్యే మల్లాది విష్ణు, డెప్యూటీ మేయర్ అవుతు శ్రీశైలజ తదితరులు పాల్గొని అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసిన ఘనంగా నివాళులర్పించారు. 58వ డివిజన్‌లో పలు చోట్ల జరిగిన అంబేడ్కర్ వర్ధంతి కార్యక్రమాలలో డెప్యూటీ మేయర్ అవుతు శ్రీశైలజ పాల్గొని అంబేడ్కర్ విగ్రహాలు, చిత్రపటాలకు పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు.

ఘనంగా ప్రారంభమైన సుబ్రహ్మణ్య షష్ఠి మహోత్సవాలు

మధురానగర్(విజయవాడసెంట్రల్): మధురానగర్‌లో స్వయంభూ శ్రీ బాలసుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయంలో శుక్రవారం గణపతి పూజతో సుబ్రహ్మణ్య షష్ఠి మహోత్సవాలు ఘనంగా ప్రారంభం అయ్యాయి. అనంతరం స్వామివారికి 108 కావడిలతో భక్తులు వివిధ రకాల ద్రవ్యాలు చేతబూని మేళతాళాలతో మధురానగర్ పుర వీధుల్లో కావడి ఉత్సవం ఊరేగింపు నిర్వహించారు. చిన్నారులు, మహిళలు, కావడి ఉత్సవంలో ఉత్సాహంగా పాల్గొన్నారు. ఆలయ అర్చకులు రంగావజ్ఝుల ప్రసాద్ శర్మ ఆధ్వర్యంలో ఆలయ ధర్మకర్తలు బోయిన గోపాలకృష్ణ, హరికృష్ణ దంపతులు స్వామివారికి పంచామృత అభిషేకాలు నిర్వహించారు. పెద్ద సంఖ్యలో భక్తులు షష్ఠి ఉత్సవాలలో పాల్గొని భక్తిశ్రద్ధలతో పూజలు చేసి తీర్థప్రసాదాలు స్వీకరించారు.


స్వామివారి ఉత్సవ మూర్తులకు అభిషేకం చేస్తున్న అర్చకులు

- **నేడు కల్యాణం**

శనివారం ఉదయం శ్రీ వల్లీ దేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వర స్వామి కల్యాణ మహోత్సవం నిర్వహించనున్నారు. అనంతరం మధ్యాహ్నం అన్నప్రసాద వితరణ జరుగుతుందని ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యులు తెలిపారు.

- **దావు బుచ్చయ్యకాలనీలో పుష్పార్చనలు**

దావు బుచ్చయ్యకాలనీ శ్రీ శ్యామలాంబదేవి అమ్మవారి దేవాలయంలో శుక్రవారం సుబ్రహ్మణ్య షష్ఠి మహోత్సవాలలో భాగంగా పుష్పార్చన కార్యక్రమం జరిగింది. ఆలయ అర్చకులు స్వామివారికి విశేషంగా పూజలు, పుష్పార్చనలు శాస్త్రోక్తంగా నిర్వహించారు. పెద్ద సంఖ్యలో మహిళలు, భక్తులు పాల్గొన్నారు. కార్యక్రమాలను ఆలయ ధర్మకర్త చింతపల్లి కనకారావు పర్యవేక్షించారు.


కావడి ఉత్సవంలో పాల్గొన్న భక్తులు

తవ్వేసి...వదిలేస్తున్నారు!

మధురానగర్(విజయవాడసెంట్రల్): మధురానగర్‌లో వాటర్ పైపులైన్ పనుల్లో భాగంగా తవ్విన రోడ్లు సక్రమంగా పూడ్చటం లేదు. దీంతో రోడ్లు గుంతలుగా ఏర్పడి రాకపోకలకు వాహన చోదకులు, పాదచారులు అవస్థలు పడుతున్నారు. గోతులు సరిగా పూడ్చాలని అడిగితే నోటికి వచ్చినట్లు మాట్లాడుతున్నారని వాపోతున్నారు.మధురానగర్‌లో పాత పైపులైన్‌ల స్థానంలో కొత్త పైపులైన్‌లు ఇవ్వటం లేదు. పాత పైపులైన్‌లకు తాగునీరు సరఫరా నిలిపివేశారు. దీంతో పాత పైపులైన్‌లు ఉన్న వారు తాగునీటికి కటకటలాడుతున్నారు. కనీసం ఇంట్లో వాడుకునేందుకు సైతం మినరల్ వాటర్ కొనుక్కోవాల్సి వస్తుందని వాపోతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి తవ్విన గోతులను సరిచేయాలని, పాత పైపులైన్‌ల స్థానంలో కొత్తవి ఏర్పాటు చేసి తాగునీటికి ఇబ్బంది లేకుండా చేయాలని కోరుతున్నారు.



మధురానగర్‌లో తవ్వి సరిగా పూడ్చని గోతులు

సనాతన ధర్మం కాదు..సమ ధర్మం కావాలి

సీపీఎం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వి.శ్రీనివాసరావు

భవానీపురం(విజయవాడపశ్చిమ):భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ వర్ధంతిని పురస్కరించుకుని అంబేడ్కర్ మిషన్ ఏపీ ఆధ్వర్యంలో శుక్రవారం తుమ్మలపల్లి కళాక్షేత్రం వద్దగల అంబేడ్కర్ విగ్రహానికి నివాళి కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా సీపీఎం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వి.శ్రీనివాసరావు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వంలో ఎక్కడ చూసినా దళితులు, గిరిజనులపై దాడులు జరుగుతున్నాయని తెలిపారు. కుల నిర్మూలన, కులాంతర వివాహాలు జరిగితేనే దళిత జాతి మనుగడ బలోపేతం అవుతుందన్నారు. మనకు కావాల్సింది సనాతన ధర్మం కాదని.. సమ ధర్మం కావాలని అన్నారు. కార్యక్రమంలో కుల విమోచన పోరాట సమితి, దళిత సోషల్ విముక్తి నాయకులు ఆంధ్ర మాల్యాద్రి, నటరాజ్, డప్పు కళాకారుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు జి.క్రాంతి, టి.వెంకటేశ్వరరావు, డి. రత్నప్రదీప్, నక్కా వెంకటేశ్వరరావు, అంబేడ్కర్ మిషన్ నాయకులు బి.జగదీష్, ఎం.సుబ్రహ్మణ్యం, గంజి బాబూరావు తదితరులు పాల్గొన్నారు.


అంబేడ్కర్‌కు నివాళులర్పిస్తున్న శ్రీనివాసరావు

నాదామృతం నాగలక్ష్మి మృదంగ విన్యాసం

విజయవాడ కల్చరల్: డాక్టర్ మండపాక నాగలక్ష్మి మృదంగ విన్యాసం అనన్య సామాన్యమని సంగీత విద్వాంసుడు కేవీ బ్రహ్మానందరావు అన్నారు. సంగీత సమ్రాట్ ఎస్పీబాల సుబ్రహ్మమణ్యం స్మారక సంస్థ, తెలుగు కళావాహిని, కామ్రేడ్ జీఆర్‌కే, పోలవరపు సాహితీ సమితి, కేవీ బ్రహ్మానందరావు సంస్థల ఆధ్వర్యంలో శుక్రవారం గాంధీనగర్ కౌతా పూర్ణానందం కళావేదికమీద అంతర్జాతీయ సంగీత విద్వాంసురాలు అదితీ బీ ప్రహ్లాద్ గాత్ర కచేరి మృదుమధురంగా సాగింది. అనంతరం మృదంగ విద్వాంసురాలు, విజయనగరం సంగీత కళాశాల విశ్రాంత ప్రిన్సిపాల్ డాక్టర్ మండపాక నాగలక్ష్మికి ఆత్మీయ సత్కార కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో గోళ్ళ నారాయణరావు, చింతకాయల చిట్టిబాబు, కేఎస్ పూర్ణచంద్రిక పాల్గొన్నారు.


డాక్టర్ మండపాక నాగలక్ష్మిని ఆత్మీయంగా సత్కరించిన నిర్వాహకులు

పందెం కోళ్లు చోరీ

మధురానగర్(విజయవాడసెంట్రల్): మధురానగర్ నేతాజీ కాలనీలో నాలుగు పందెం కోళ్లు(సుమారు రూ. 80 వేలు విలువ) చోరీ అయ్యాయి. వివరాల్లోకి వెళితే...కాలనీకి చెందిన బోనం నాగు కొంతకాలంగా నాలుగు పందెం కోళ్లను పెంచుతున్నారు. శుక్రవారం తెల్లవారు జామున సుమారు 3 గంటల ప్రాంతంలో యాక్టివాపై వచ్చిన గుర్తు తెలియని వ్యక్తులు పందెం కోళ్లను తీసుకుని పరారయ్యారు. గుణదల పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మహానటి సావిత్రి నటన భావి నటులకు ఆదర్శం



విజయవాడకల్చరల్: మహానటి సావిత్రి నటన భావి నటులకు ఆదర్శమని సావిత్రి కళా పీఠం వ్యవస్థాపకురాలు పరుచూరి విజయలక్ష్మి అన్నారు. మహానటి సావిత్రి సాహిత్య– సాంస్కృతిక కళాపీఠం ఆధ్వర్యంలో గాంధీనగర్‌లోని హనుమంతరాయ గ్రంథాలయంలో శుక్రవారం సావిత్రి జయంతి వేడుకలు, సినీ సంగీత విభావరి, కళాకారులకు ఆత్మీయ సత్కార కార్యక్రమాన్ని నిర్వహించారు. శాతవాహన కళాశాల కరస్పాండెంట్ నిడుమోలు రమాసత్యనారాయణ మాట్లాడుతూ సావిత్రి లేని తెలుగు చిత్రసీమను ఊహించలేమన్నారు. కార్యక్రమంలో వివిధ రంగాలకు చెందిన జనార్దన్, జేడీ లక్ష్మీనారాయణ, రోజా ప్రసన్నలత, ప్రభల శ్రీనివాస్, ఎంఎస్ నారాయణ తదితరులు పాల్గొన్నారు. గాయనీ గాయకులు పలు తెలుగు హిందీ చిత్ర గీతాలను ఆలపించారు. నవరంగ్ థియేటర్ అధినేత వాసిరెడ్డి భూపాల్ ప్రసాద్‌ను నిర్వాహకులు ఘనంగా సత్కరించారు.